క్లుప్తంగా

కంపోస్ట్ ఎరువు తయారుచేయాలి

డీఎల్పీవో సాయిబాబా



చిట్కుల్‌లో డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న డీఎల్పీవో

చిలప్‌చెడ్(నర్సాపూర్): డంపింగ్ యార్డులలో తడిచెత్తతో కంపోస్ట్ ఎరువు తప్పనిసరిగా తయారుచేయాలని డీఎల్పీవో సాయిబాబా అన్నారు. గురువారం ఆయన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో గల డంపింగ్ యార్డు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటికలను సందర్శించి, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గ్రామంలో చెత్త సేకరణ జరిగినప్పటికీ, తడి, పొడి చెత్తను వేరుచేసి, తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి, ఆ ఎరువులను నర్సరీ, పల్లె ప్రకృతి వనాలకు వినియోగించాలని కోరారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలలో ప్రతి వ్యక్తిని భాగస్వామిని చేసి, గ్రామాల స్వచ్ఛతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓ సస్పెండ్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ సీఈఓ వేణుగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. పీఏసీఎస్‌లో అవినీతి ఆరోపణలపై, పీఏసీఎస్ డైరెక్టర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ విచారణ చేపట్టాలని మెదక్ ఆర్డీఓ రమాదేవిని ఆదేశించిన విషయం విదితమే. ఆర్డీఓ రెండు దఫాలుగా విచారణ చేపట్టారు. అవినీతి జరిగిందని, నిధుల దుర్వినియోగం చేశారంటూ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. కాగా, కలెక్టర్ ఆదేశాలతో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కరుణను సీఈఓ వేణుగోపాల్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శివకృష్ణకు ఇన్‌చార్జి సీఈఓగా అదనపు బాధ్యతలను అప్పగించారు.

ముస్లింల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

నర్సాపూర్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని నర్సాపూర్‌లో ముస్లిం మైనార్టీలు గురువారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు వీధులు, మెయిన్‌రోడ్డు గుండా ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీఓ రమాదేవి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజావాణి కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, రిజిస్ట్రేషన్లు, ప్రజలకు అందిస్తున్న సదుపాయాలపై అధికారులతో చర్చించారు. సమస్యలు పెండింగ్‌లో లేకుండా చూడాలని, ప్రజలు జిల్లా కార్యాలయానికి వెళ్లకుండా తమ భూ సమస్యలను ఇక్కడే పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత



ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రూ.4లక్షల ప్రొసీడింగ్ కాపీని మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మజీద్ కమిటీ అధ్యక్షుడు చాంద్ ఖురేషీ, అబ్దుల్‌ఖాతర్, రబ్బాణి, సలీంషేక్, ఫరీద్, జమీర్, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, శ్రీపతిరావు ఉన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నేతలకు కృష్ణారెడ్డిని సన్మానించారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- డీఆర్‌డీఏ ఏపీడీ సరస్వతి
- కౌడిపల్లి మండల సమాఖ్య 15వ వార్షిక మహాసభ



కౌడిపల్లి మండల వార్షిక మహాసభలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ సరస్వతి తదితరులు

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ ఏపీడీ సరస్వతీ తెలిపారు. గురువారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య 15వ వార్షిక మహాసభలో పాల్గొని ఆమె మాట్లాడారు. మహిళలు సంఘటితంగా ఉండి పొదుపు చేయడంతో బ్యాంక్, స్త్రీనిధి రుణాలు ఇచ్చి ఆర్థిక అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. కాగా మహిళలకు మరింత ప్రోత్సాహం అందించి వ్యాపార రంగాలలో రాణించేలా కృషి చేస్తూ కోటీశ్వరులను చేయడం ప్రభుత్వ ఉద్దేశమన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఎంటర్‌ప్రైజెస్ రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. డెయిరీ, నాటుకోళ్ల పెంపకం, కిరాణం, పిండిగిర్ని, ఇతర వ్యాపారాలకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. ప్రతి మహిళ మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఏపీఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ వార్షిక ఆర్థిక ప్రగతిని వివరించారు. మండలంలో 24 గ్రామ సంఘాలలో మొత్తం 694మహిళ సంఘాలు ఉండగా 7,312 మంది సభ్యులు ఉన్నట్లు చెప్పారు. మహిళ సంఘాలలో రూ 26,79,596 టర్నోవర్ ఉండగా రూ 1,20,966 లాభం వచ్చినట్లు చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు పోషణ మాసం సందర్భంగా పోషణ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, డీపీఎం జాన్‌కెనెడీ, ఏపీఎం సంగమేశ్వర్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రజిత, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు లక్ష్మి, సుల్తాన, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, కోశాధికారి కవిత, ఐకేపీ సీసీలు, సీఏలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళ సమాఖ్య గ్రామసంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ఇక్రిశాట్‌ను సందర్శించిన మహిళా రైతులు



ఇక్రిశాట్ క్షేత్ర సందర్శనలో పాల్గొన్న మహిళ రైతులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల మహిళ రైతులు క్షేత్ర సందర్శనలో భాగంగా గురువారం ఇక్రిశాట్ పరిశోధనాలయాన్ని సందర్శించారు. సెహగల్ ఫౌండేషన్ హైటెక్ సీడ్స్ సంస్థల ఆధ్వర్యంలో మహిళా రైతులను ఇక్రిశాట్‌కు తీసుకెళ్లగా జొన్న, సజ్జ, కంది, వేరుశెనగ, రాగుల పంటలను పరిశీలించి పంటల సాగు వివరాలను తెలుసుకున్నారు. వర్షం నీటిని మడుగుల్లో నిల్వ చేసి పంటలకు వాడుకునే పద్ధతులు, ట్రాక్టర్లతో పిచికారీ చేసే పద్ధతులు ఇక్రిశాట్ సంస్థ ప్రతినిధులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడ్ వాణి, ప్రతినిధులు అవినాశ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): నీటి వనరుల అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బుజ్జిబాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సేగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి యాజమాన్య సంఘాల బలోపేతంపై రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సేగల్ సంస్థ మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల అభివృద్ధితో పాటు రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ, అధునిక వ్యవసాయం గురించి చేసిన కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. చెరువుల మరమ్మతుల వల్ల వర్షపు నీటి నిల్వలు సంరక్షించుకునే అవకాశం ఉందన్నారు. కట్ట కాల్వలు, పంట కాల్వలు ఆక్రమించకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి యాజమాన్య సంఘాలు బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సేగల్ ఫౌండేషన్ సిబ్బంది వేమనారాయణ, సాయికుమార్, సాయి మనోత్ర తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల డైట్‌చార్జీలు పెంచాలి



కౌడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావ్

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావ్ డిమాండ్ చేశారు. గురువారం కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాల వద్ద భోజన విరామ సమయంలో టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల డైట్ చార్జీలు పెంచాలన్నారు. గురుకులల్లో మహిళ ఉపాధ్యాయులు రాత్రి 9గంటల వరకు పనిచేస్తున్నారని, వారిపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి విముక్తి కల్పించాలన్నారు. అదనపు పనులకు ట్యూటర్లు, వార్డెన్లను నియమించాలన్నారు. 010పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి, మండలశాఖ అధ్యక్షుడు శేషగిరిరావ్, నాగుల్‌మీర తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటి ఇంగ్లిష్–2, పీజీటీ కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్, మ్యాథ్స్–2 తో పాటు టీజీటీ సైన్స్, సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి కోసం దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 21లోగా తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని, వీరికి 23న డెమో తరగతులు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.

ఎల్పీజీ సబ్సిడీ పత్రాల అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహాలక్ష్మి పథకానికి అర్హులైన లబ్ధిదారులకు ఎల్పీజీ సబ్సిడీ పత్రాలను తహసీల్దార్ ముసద్దిక్ అన్నారు. గురువారం ఆయన చిలప్‌చెడ్‌లో అర్హులకు సబ్సిడీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్నా ఎల్పీజీ సబ్సిడీ రాకపోతే, ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గజ్వేల్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని మండల పరిధిలోని కొడకండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మధునాల శ్రీనివాస్ సూచించారు. పాఠశాలలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛత–పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు రెహల, కల్పన, ఆశా వర్కర్‌లు రాజమణి, వినోద పాల్గొన్నారు.

చక్కెర లారీ బోల్తా



దుబ్బాకరూరల్: జాతీయ రహదారిపై చక్కెర లారీ బోల్తా పడిన ఘటన హబ్సీపూర్ శివారులో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వస్తున్న చక్కెరలోడ్ రహదారి ప్రక్కన కల్వర్టును ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమా దం జరగలేదు. లారీ పాక్షికంగా దెబ్బ తిన్నది.

గజ్వేల్ ఖ్యాతిని చాటిచెప్పాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: చలనచిత్రరంగంలో రాణించి గజ్వేల్ ఖ్యాతిని చాటిచెప్పాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. శ్రీజగన్మాత రేణుక క్రియేషన్స్ బ్యానర్‌పై గజ్వేల్ ప్రాంతానికి చెందిన ప్రొడ్యూసర్లు సామ శ్రీధర్, పంజాల వెంకట్‌గౌడ్, గౌరిశెట్టి శ్రీనివాస్ సాధర్యంలో ప్రొడక్షన్ నెంబర్ వన్ ద్వారా దర్శకుడు బన్నీ అశ్వంత్ రూపొందిస్తున్న రాజ మార్కండేయ సినిమా షూటింగ్ గురువారం గజ్వేల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించడంపై యూనిట్ సభ్యులను అభినందించారు. మాజీ డీఎస్పీ కాల్వ శ్రీధర్‌రావు, ఆర్యవైశ్య నాయకులు సంతోష్, భిక్షపతి, సినీ నటులు తేజస్, నాగేష్, శ్రీనివాస్‌నాయుడు, ప్రత్యూష, దీపిక, సింగర్ నవీన్, ప్రశాంతి, మహేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు సోపానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈఓ

చేగుంట(తూప్రాన్): క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు చేగుంట ఉన్నత పాఠశాలలో బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడినా మరోసారి గెలవాలనే సంకల్పం బలపడుతుందని తెలిపారు. చదువులోకూడా పోటీ తత్వంతో ముందుకు సాగడానికి క్రీడాస్ఫూర్తి దోహదపడుతోందని పేర్కొన్నారు. విద్యార్థులకు బహుమతులను అందించేందుకు ముందుకు వచ్చిన దాత వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతిని డీఈఓ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నీరజ, స్పోర్ట్స్‌స్కూల్ ప్రిన్సిపాల్ సుమతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రకళ, పీడీ శారద పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వెంకటేశ్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటంవల్లే భూములు

సీపీఎం జిల్లా నేత శశిధర్



నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్: నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగానే పేదలకు భూములు దక్కాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవంలో భాగంగా గురువారం హుస్నాబాద్‌లోని అనబేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ నేడు తెలంగాణ సమాజం అనుభవిస్తున్న స్వేచ్ఛా వాయువుల వెనుక వేలాది మంది కమ్యూనిస్టుల త్యాగం దాగి ఉందన్నారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీలు రెండు వర్గాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం తగదని మండిపడ్డారు. రాజకీయ అవసరాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో గోపాలస్వామి, రవికుమార్, శివరాజ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

ఏచూరి సేవలు శ్లాఘనీయం

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మల్లేశం

నర్సాపూర్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి సేవలు శ్లాఘనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏచూరి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన విద్యార్థి దశ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారని, తన చిన్నతనంలోనే అనేక విద్యార్థి ఉద్యమాలలో పాల్గొని గొప్ప పేరు తెచ్చుకున్నారని చెప్పారు. ఆయన సీపీఎం పార్టీకి, ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని మల్లేశం కొనియాడారు. ప్రజానాయకున్ని కోల్పోవడం బాధాకరమని చెప్పారు. కార్యక్రమంలో ఎల్లంకీ కాలేజీ చైర్మన్ అశోక్‌కుమార్, సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ఇతర నాయకులు చరన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ కేసులో ముగ్గురి అరెస్ట్

మనోహరాబాద్(తూప్రాన్): సాంఘిక బహిష్కరణ కేసులో గురువారం ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గౌతోజీగూడెంలో తమను సాంఘిక బహిష్కరణ చేశారని గ్రామానికి చెందిన పంచమి చంద్రం ఫిర్యాదు మేరకు 19 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గౌతోజీగూడెంకు చెందిన పర్సబోయిన నర్సయ్య, చాపల కృష్ణ, , పంచమి పెంటయ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అక్కారం, శ్రీగిరిపల్లి, కోనాపూర్ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్ సబ్‌స్టేషన్ నుంచి ఒకే ఫీడర్‌పై శ్రీగిరిపల్లి మీదుగా క్రషర్ మెషీన్లకు, పాతూరు, ఇప్పలగూడెం, కిష్టాపూర్, గణేష్‌పల్లి, తీగుల్, హవాయిగూడెం, కోనాపూర్, అక్కారం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తినపుడు ఎల్‌సీలు తీసుకోవడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీంతో ఇళ్లలో ఉండే ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి అక్కారం, శ్రీగిరిపల్లి గ్రామాలకు వేర్వేరుగా ఆన్–ఆఫ్‌లు బిగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి

వెల్దుర్తి(తూప్రాన్): ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ ఉమాదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, ఓటరు జాబితాలో సవరణలు చేయడం వంటివి చేపడతారని ఇందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ విఘ్నేశ్వర్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలలో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశామని, ఆ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధం చేసిన జాబితా తప్పొప్పులు ఉన్నా, సవరించుకునేందుకు ఈ నెల 21 తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

తప్పులను సరిచేస్తాం

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు జాబితాలోని తప్పులను సరిచేసి తుది జాబితాను ప్రదర్శనకు పెట్టనున్నట్లు చిన్నశంకరంపేట ఎంపీడీఓ దామోదర్ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో కుటుంబ సభ్యులందరిని ఒకే వార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పాగుల రాజు, సీపీఐ నాయకుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు. నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆనంద్ ఆధ్వర్యంలో అఖిల పక్షం సమావేశం జరిగింది.

అభ్యంతరాలుంటే సవరణ

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటరు జాబితా అందుబాటులో ఉందని ఏమైన అభ్యంతరాలు ఉంటే ఆయా పార్టీ నాయకులు ఈ నెల 21లోగా సమాచారం అందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నేతలు ఏమైన అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి, బీజేపీ అధ్యక్షుడు యాదగిరి, బీఆర్ఎస్ నాయకుడు రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట (మెదక్): ఓటరు లిస్టు పరిశీలన నిమిత్తం గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టులో ఏమైనా తప్పులు దొర్లితే ఈనెల 21లోగా తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సజీలుద్దీన్ సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రతినిధులు ఉమామహేశ్వర్, దయానందరెడ్డి పాల్గొన్నారు.

హవేళిఘనపూర్‌లో..

హవేళిఘణాపూర్(మెదక్): ఓటరు జాబితాలో ఏవైనా తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరి చేసుకోవాలని మైనింగ్ శాఖ ఏడీ, మండల ప్రత్యేక అధికారి రమేశ్ అన్నారు. గురువారం మెదక్ మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఓటరు ముసాయిదాపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, పార్టీల నాయకులు అంజాగౌడ్ పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.